Digitized in 2006
by
Thrinaina Informatics Ltd, Secunderabad, A.P., India.
(http://www.thrinaina.com)

From the original owned by
Sundarayya Vignana Kendram
and its partner Institutions

as part of the
British Library Endangered Archives Programme
supported by the
Lisbet Rausing Charitable Fund

Except for individual research purpose
any reproduction should be made with
written permission from the

Sundarayya Vignana Kendram,
1-8-1/B/25/A, Bagh Lingampally, Hyderabad - 500 044
Andhra Pradesh, India

COPYRIGHT STATEMENT

The copyright laws of the United States (Title 17, United States Code) and of India (Copyright Act of 1957) govern the making of photocopies or other reproductions of copyrighted material including foreign works under certain conditions. In addition, the United States extends protection to foreign works by means of various international conventions, bilateral agreements, and proclamations.

Under certain conditions specified in the laws, libraries and archives are authorized to furnish a photocopy or other reproduction. One of these specified conditions is that photocopy or reproduction is not to be used for any purpose other than private study, scholarship, or research. If a user makes a request for, or later uses, a photocopy or reproduction for purposes in excess of "fair use," that user may be liable for copyright infringement.

These institutions reserve the right to refuse to accept a copy order if, in their judgment, fulfillment of the order would involve violation of the copyright laws of the United States or India.

సంజీవరావు, మొసలికంటి

ప్లాసీయుద్ధము

Vizag, 1924

Record no. 763

Sañjīvarāvu, Mosalikaṇṭi

Plāsīyuddamu

Vizag, 1924

Record no. 763

SUNDARAYYA VIGNANA KENDRAM

1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

సంజీవరావు, మొసలికంటి.

ప్లాసీయుద్ధము : ఆంగ్లేయులు బంగాళాదేశమును జయించినకథ / గ్రంథకర్త మొసలికంటి సంజీవరావు.- with forward by Mr. Venkata Rangayya.- Vizag : మొసలికంటి సంజీవరావు, 1924.

2, 30 p. ;18 cm.

Record no. 763

Sañjīvarāvu, Mosalikaṇṭi.

Plāsīyuddamu : Āṃglēyulu Baṅgāḷādēśamunu jayiñcinakatha / granthakarta Mosalikaṇṭi Sañjīvarāvu.- with forward by Mr. Venkata Rangayya.- Vizag : Mosalikaṇṭi Sañjīvarāvu, 1924.

2, 30 p. ;18 cm.

Record no. 763

35 mm microfilm

Image placement: IA (IIA) IB IIB Date filming began:

[illegible] అముద్రము

Sl.No. 371

Acc No. 9387

763

1033 S.No. 371 | Acc No 9387

ఆంధ్ర సంజీవినీ గ్రంథమాల 3.

సంపాదకుఁడు,

మొసలికంటి సంజీవరావు

18 AUG 1924

ప్లాసీ యుద్ధము

(ఆంగ్లేయులు బంగాళాదేశమును జయించిన కథ.)

BATTLE OF PLASSEY

with a foreword by

Mr. VENKATARANGAYYA, M. A.

Maharaja's College, Vizianagram.

గ్రంథకర్త:

మొసలికంటి సంజీవరావు,
విశాఖపట్టణము.

సర్వస్వామ్యసంకలితము.]

[వెల **0-4-0.**

PRINTED AT THE V. R. C. PRESS, VIZAG.

1924.

విజ్ఞప్తి

ఆంధ్ర సంజీవినీ గ్రంథమాల కొంతకాలము భాషాసేవ నొనరించిన విషయము నీపురజనులెఱింగియే యున్నారు. ఆంధ్ర లోక విఖ్యాతులగు బ్రహ్మశ్రీ కేతవరపు వెంకటశాస్త్రిగారిచే రచింపఁబడిన 1 'ఇచ్ఛినీ కుమారి', 2 'బొబ్బిలి ముట్టడి' యను నవలలు ఈగ్రంథమాల పేరుననే ప్రచురింపఁబడియున్నవి. కాని, కారణాంతరములచే గ్రంథప్రచురణ మాగిపోయెను. ఐనను, 'సంజీవినీ' గ్రంథమాల సదా 'సజీవి' యై యుండునని తెలుపుటకై ఉత్సాహవంతులగు విద్యార్థులు (1 రాచర్ల జోగిరాజు, 2 కేదారశెట్టి వెంకట అప్పారావు, 3 సున్నపు వీర్రాజు, 4 పాలూరి శీతాపతి, 5 చిక్కుడుకాయల జోగారావు, 6 శ్రీరంగం శ్రీనివాసరావు, 7 స్థానాపతి సత్యనారాయణరావుగార్లు) చిన్నచిన్న పొత్తములను బ్రచురింపఁగడంగిరి. ఈ యువకుల ఉత్సాహమును కార్యదీక్షయును శ్లాఘనీయములు.

జనోపయోగములై యుండు వివిధ గ్రంథములను సకాలమున బ్రచురించు నుద్దేశముతో తత్కార్యభారమును వహించిన నాకు విద్యాభిమానులును ఉదారవంతులును తమ సాహాయ్యము నొసంగి, నా యుద్యమమును కొనసాగింతురు గాక.

(1) 0-4-0 ప్రవేశ రుసుము చెల్లించి, పేరు నమోదు చేయించుకొని, మేము ప్రచురించు గ్రంథముల నన్నింటిని గొను వారు శాశ్వతపు చందాదారులు.

(2) సంవత్సరమున నైదారు గ్రంథములు వెలువడును.

(3) మాగ్రంథములన్నియు చౌకధరల కొసంగఁబడును.

(4) మాచందాదారులకు మాగ్రంథములన్నియు తగ్గింపు ధరల కొసంగఁబడును.

(5) 'పోస్టు, వీ పీ' వగైరా ఖర్చులను చందాదారులే భరింపవలయును.

(6) సంవత్సరమునకు రు 3 లు ముందుగా చెల్లించువారికి 'పోస్టు, వీ పీ' వగైరా ఖర్చులను మేమే భరించి గ్రంథములను బంపెదము.

(7) సంవత్సరమునకు రు 25 లు ముందుగా చెల్లించువారు పోషకులుగా గణింపఁబడుదురు. మాగ్రంథములన్నియు వారికి నుచితముగ నొసంగఁబడును.

పెద్దవీధి,
విశాఖపట్టణము. }

మొసలికంటి సంజీవరావు,
సంపాదకుఁడు.

పీఠిక.

వర్తకమునకై మనదేశమునకు వచ్చిన ఆంగ్లేయులు కాలక్రమమున మనకు పరిపాలకు లగుటకంటె అద్భుతమగు విషయము మరియొకటి లేదు. ఇది యెట్లు జరిగెనో తెలియపఱచు నుద్దేశముతో "ప్లాసీ యుద్ధము" అను ఈచిన్నపుస్తకము వ్రాయబడినది. అప్పటికాలపు ఆంగ్లేయులయు వారి నాయకులయు సుగుణ దుర్గుణములు చక్కఁగ నిందు వివరింపబడియున్నవి. స్వలాభప్రియులును దేశద్రోహులును అగు మనవారేవిధముగ ఆంగ్లేయులకు సహాయ మొనర్చి నదియు చక్కఁగ వర్ణింపబడియున్నది. గ్రంథకర్త యొక్క అభిప్రాయము లన్నిటితో నేకీభవింపజాలని పాఠకులుకూడ గ్రంథమును పఠించి ఆనందింప గలరని నా నమ్మకము. ప్రజలు గ్రంథకర్తను తగు విధముగ గౌరవించి వారిచే మరికొన్ని గ్రంథములను వ్రాయింతురు గాక.

మహారాజాకాలేజి,
విజయనగరం,
15-7-24. }

మామిడిపూడి వెంకటరంగయ్య.

An Appreciation.

This booklet is characterised by lucidity of expression, narration in detail, and by the events being placed each in its proper setting. A contrast is well laid between the prudent administration of Allavardi Khan and the irresponsible foolhardiness of Siraj-ud-daula. The lack of patriotism both in the rulers and the ruled in Bengal of that decadent age has been prominently brought out. Most striking of all, the quick development of events, one following the other and leading to the catastrophe at Plassey, is traced with elegance and ease, and a few important source books have been utilised for the purpose.

Histories are yet to be written in our Vernaculars of critical periods in the life of our people on an enlarged basis and with a depth of detail. This is an earnest attempt in that direction. We wish we have more of the kind.

Mrs. A. V. N. College,
VIZAGAPATAM,
20-7-24.

(Sd.) **N. Rangaswami,**
Lecturer in History.

హైందవచారిత్రమునందు ప్లాసీయుద్ధము మిక్కిలి ప్రధానమైనది. అంతవఱకును వర్తకమొనరించుచు లాభమార్జించుచుండిన ఆంగ్లేయుల కొక్కసారి రాజ్యాధికారములు లభ్యమాయెను. నాటితో, హైందవచారిత్రమున నొక క్రొత్తయుగము ప్రారంభమాయెను. జనసామాన్యమునకు దెలియని సూక్ష్మములను నెఱింగించుచు, ప్రసిద్ధిగాంచిన ప్లాసీయుద్ధముయొక్క ప్రాముఖ్యతను స్పష్టీకరించు నుద్దేశమే యీగ్రంథరచనకు గారణము. బక్సారు యుద్ధమను రెండవ గ్రంథమున విషయము ముగియును. విద్యార్థులు లోపములను సైరింతురుగాక.

నా యీచిన్నిపొత్తమునకు పీఠికను వ్రాసియిచ్చిన శ్రీయుత మా॥ వెంకటరంగయ్యగారికిని (M. A., Maharaja's College, Vizianagram) తమ యభిప్రాయమును వ్రాసియిచ్చిన శ్రీయుత ఎన్. రంగస్వామిగారికిని (M. A., Mrs. A. V. N. College, Vizagapatam) కృతజ్ఞతాపూర్వకముగ వందన సహస్రముల నర్పించుచున్నాడను. ఈగ్రంథమును రచించు సందర్భముననను, ప్రచురించు సందర్భముననను నాకత్యంత సాహాయ్యమొనరించిన మదీయ మిత్రులగు శ్రీయుత సుంకరి పార్థసారథినాయుడుగారును (M. A. L. T. Mrs. A. V. N. College) శ్రీయుత సబ్నివీసు సత్యకేశవరావుపంతులుగారును, అస్మదీయాగ్రజులగు శ్రీయుత హనుమంతరావు పంతులుగారును (B. A. L. T., Maharaja's College, Vizianagram) నాకెంతయు వందనీయులు. మదీయమిత్రులును, శ్రీ విజయరామచంద్ర ముద్రాక్షరశాలాధిపతులును అగు శ్రీయుత విన్నకోట దుర్గారావు శ్రేష్ఠిగారుకూడ నెంతయు వందనీయులు.

విశాఖపట్టణము,
22-7-24.

గ్రంథకర్త.

ప్లాసీ యుద్ధము.

'ప్లాసీ' యనునది బంగాళాదేశమునందలి యొక చిన్నగ్రామము. తత్సమీపమున జరిగిన యుద్ధకారణమున నీకుగ్రామము ప్రపంచవిఖ్యాతిగాంచియున్నది. బంగాళా బీహారు ఒరిస్సాదేశములను బరిపాలించుచుండిన సురాజదౌలాయును, వర్తకవేషధారులగు నాంగ్లేయులును ఆయుద్ధమున బాల్గొనియుండిరి. భరతఖండమునందంతటను మహావృక్షమువలె నావరించియున్న బ్రిటిషు సామ్రాజ్యమునకీ ప్లాసీయుద్ధమే మూలబీజము. ఈసందర్భమున గమనింపవలసిన విషయము లనేకములున్నవి.

'ఆలీవర్దీఖాను' యను నాతఁడు బంగాళా, బీహారు ఒరిస్సాదేశములను 1739 మొదలు పరిపాలించుచుండెను. అతని పరిపాలనము కఠినముగనుండినను, జనసామాన్యమును బీడించునధికారులను జమీందారులను నాతఁడు నొక్కియుంచుటచే నారాష్ట్రములందలి జనులెల్లరు హాయిగ మనుచుండిరి. నాఁటి పరిపాలకులకంటె నాతఁడు మేధావంతుడనియు, ఉదారస్వభావుఁడనియు, దయార్ద్రహృదయుఁడనియు ఖ్యాతిగాంచెను.

ఆతని కాలమున నాంగ్లేయులు కేవలము వర్తకులవలె సంచరించుచుండిరి. వారట్లు తమ హద్దులో నుండినంతకాలము, ఇచ్చకువచ్చునట్లు మెలంగ గలుగుచుండిరి. కాని, ఒకానొకసమయమున, నేదియో యొక కారణమున, ఆర్మీనియను వర్తకులకును హైందవ వర్తకులకును జెందియుండిన సామగ్రిని ఆంగ్లేయవర్తకులు పట్టు

కొనిరి. ఆయావర్తకు లావిషయమును ఖానునకు నివేదించిరి. ఆం
గ్లేయుల ప్రవర్తనము న్యాయవిరుద్ధముగ నుండెనని గ్రహించి, ఆ
వర్తకుల సామగ్రిని వెంటనే వారి కొప్పంగవలయునని ఆంగ్లవర్తక
సంఘాధికారుల నాతఁడాజ్ఞాపించెను. కాని, ఆతని యాజ్ఞను వారు
మన్నింపకైరి. అట్లు, తన నవమానింప సాహసించిన పాశ్చాత్యు
లపై గుపితుఁడై, కాసింబజారునందుండిన వారి కర్మాగారమును
ఆతఁడు వెంటనే వశపఱచికొనెను. తోడనే, ఆంగ్లేయుల ధైర్య
మంతయు మాయమాయెను. ఆలివర్ధిఖానునకు బండ్రెండు లక్షల
రూప్యములను సమర్పించి, దైన్యముగ వేడి, వా రాతని బ్రసన్ను
నిఁ జేసికొనఁగలిగిరి. వారితోడి వర్తకము దేశాభివృద్ధికిఁ దోడ్ప
డుచుండుటచేతను, వారు దైన్యమువహించుటచేతను, వారితప్పుల
నాతఁడు సైరించెను.

బలవంతుల దురాగతముల నడంచుచు, ప్రజానురంజకముగఁ
బరిపాలించిన యా రాజ్యాధిపతి 1756 లో మరణించెను. తోడనే,
ఆతని మనుమఁడగు సురాజదౌలా సింహాసనాసీనుఁడాయెను. ఆతఁ
డు రాజ్యాధిపతియగుటకు మూడునాలుగేండ్లు పూర్వమే, ఆంగ్లే
యు లాతనికి 15560 రూప్యములను గానుకగా సమర్పించినవార
లై, రాజగునంతనే యాతఁడు తమకెద్దియో మహోపకార మొ
నరించునని వారాసించి యుంటిరి. కాని, వారికి నాశాభంగము క
లిగెను. జయప్రదముగ వ్యాపారమొనరించుచు, ధనవంతులగుచు,
విశేషముగ పలుకుఁబడిని గడించుచుండిన ఆంగ్లేయులను ఆతఁడను
మానింప దొడంగెను. ఆసమయముననే వారు కలకత్తానగరము
యొక్క ప్రాకారములను బలపఱుప నారంభించిరి. అట్టి యుద్ధప్ర
యత్నములను వారేల యొనరించుచుండిరో తెలుపవలయునని న

బాబు కోరెను. ఫ్రెంచివారు తమపైఁ దండెత్తుదురని తెలియవచ్చు
టచేఁ దామట్టి ప్రయత్నము లొనరించుచుంటిమని ఆంగ్లేయవర్త
కులు బదులిడిరి. కాని, వారి సమాధాన వాక్యములు నబాబుకు
రుచింపవాయెను. తన దేశమున వర్తకరూపమున నుండిన ఆంగ్లే
యులు తన యధికారమునకుఁ బూర్ణముగ లోఁబడియుండుటకు
మారుగ, యుద్ధప్రయత్నము లొనరించుచుండుటఁ గాంచి, ఆతఁడు
సహింపఁజాలకపోయెను. అట్టిసమయమున మఱియొక విపరీతము
సంభవించెను. ఒక నేరస్థుఁడొకఁడు నబాబుయొక్క యధికారుల
ను దప్పించికొని, కలకత్తా నగరమున కేగి, ఆంగ్లేయుల శరణు
జొచ్చెను. వారాతనికి నభయమొసంగిరి. ఆ నేరస్థునిఁబట్టి వెంటనే
దన కప్పగింపవలయునని నబాబు ఆజ్ఞాపించెను. కాని, ఆంగ్లవర్త
క సంఘాధ్యక్షుఁడు నబాబుయొక్క యాజ్ఞను శిరసావహింపకుం
డుటయేగాక, రాజదూతను నిర్భయముగ నవమానించెను. అంత
టి పరాభవము నెన్నఁడెఱుంగని సురాజదౌలాకు, నాంగ్లేయులను
దహించివైచునంటి యాగ్రహము జనించినను, లోలోన నడంచి
కొని, వారొనరించిన మహాపరాధమును దిద్దుకొనుటకై వారికి మ
ఱల నవకాశమొసంగెను. కాని, ఆంగ్లేయులు మౌర్ఖ్యమువహించి,
బిఱ్ఱబిగిసియుండిరి. ఆతఁడంతటి శాంతము వహించినను వారు నిర్ల
క్ష్యముగ నుండుటచే, నాతఁడు యుద్ధసన్నద్ధుఁడై, కాసింబజారు
నందలి ఆంగ్లేయ కర్మాగారమును వశపఱచికొని, "వాట్సు, హే
స్టింగ్సు" మొదలగు నాంగ్లవర్తక సంఘాధికారులను ఖైదుజేసెను.
కాని, వారి కెట్టి యవమానము నొనరింపక, ఉచితరీతిని వారి నా
తఁడు గౌరవించెనని ఆంగ్లేయచరిత్రకారులే వ్రాసియున్నారు. అ
న్యదేశమునుండి వర్తకులవలె నేతెంచి, రాజు నాజ్ఞను బహిరంగ
ముగ ధిక్కరించి, చేసిన దోషమును సవరించికొనుటకు నవకాశ

మొనఁగినను మౌర్ఖ్యము వహించిన ఆంగ్లేయులను దండించుట ధర్మహితమైయున్నదనియు, నబాబుయొక్క ప్రవర్తన మంతయు సమంజసముగ నున్నదనియును పాఠకులు గుర్తింపఁగలరు.

కాసింబజారునందు జరిగిన యుదంతము కలకత్తానగరమునందలి కంపెనీసేవకులకుఁ దెలిసెను. నబాబు కలకత్తానగరముపై దండెత్తుననిగూడ వారికి దెలియవచ్చెను. ఆ నగరమున రెండువందల యుద్ధభటులును, అవసరమగునపు డాయుధపాణులు కాగలవారలంతకంటె నెక్కుడుమందియును నుండిరి. బంగాళాధిపతి యరుదెంచుచున్నాడని దెలిసినంతనే, కలకత్తానగరమునందలి ఆంగ్లేయుల ధైర్యము చలించెను. అచట నిలిచియుండినచోఁ దమకెట్టి యుపద్రవము సంభవించునోయని వెఱచి, నావలలోదిగి వారు పలాయన మొనరించిరి. నబాబుయొక్క యధికారమును ధిక్కరించుటకు మాత్రమే వారికి ధైర్యముండెనుగాని, ఆతని నెదుర్కొనుటకు ధైర్యము చాలకపోయెను. 'హోల్ వెల్' యను నాతఁడు మాత్రము ధైర్యముఁజిక్కబట్టి, తెగువజేసి, అటనిలిచి, నబాబును ఎదుర్కొనుటకై వలయు సమరప్రయత్నముల నొనరింపఁగడంగెను. కాని కార్యము లేకపోయెను. ధైర్యము గఱపవలసిన ఆంగ్లోద్యోగులు పందలై పాఱియుండుటచే, నగరవాస్తవ్యులయందుఁ గలవరము జనించెను. అచట నిలిచియుండిన సైనికులు 'హోల్ వెల్' చెప్పినట్లు మెలంగుటకు మానుగ, తమ ప్రతాపమును సారాయిబుడ్లపైఁజూపుచుండిరి. అట్టిసమయమున సురాజదౌలా సైన్యసమేతుఁడై యరుదెంచెను. కలకత్తానగరము సులువుగా నాతని యధీనమాయెను. 'హోల్ వెల్' నబాబుయొక్క సైనికులచే బంధింపఁబడి, ఆతని యెదుటకు గొంపోఁబడెను. పాశబద్ధుఁడై తన యెదుటికేతెంచిన ఆం

గ్లేయనాయకుని గాంచినంతనే, ఆతని పాశములను వెంటనే సడలింపవలయునని తన భటుల నాజ్ఞాపించి, ఆతనికిగాని ఆతని యనుచరులకుగాని ఎట్టి యపాయమైనను సంభవింపదని సురాజదౌలా యభయ మొసంగెను. ఆంగ్లేయులను భద్రపఱచుటకై నబాబుయొక్క ఉద్యోగి యొకఁడు నియోగింపఁబడెను.

నేరస్థులను బడఁద్రోయుటకై, కలకత్తానగరమున నొక బందిఖానా యుండెను. హత్యలొనరించి బంధింపఁబడు వారలను, ఋణగ్రస్థులై బంధింపఁబడు వారలనుగూడ, ఆబందిఖానాలోనే ఆంగ్లకంపెనీ యుద్యోగులు పడఁద్రోయుచుండిరి. వీరు హైందవులనియు, వారు ఆంగ్లేయులనియు విచక్షణచేయకయే, నేరస్థులనందఱి నందుఁ ద్రోయుచుండిరి. గాలి వెలుతురులందు బ్రవేశించుట కంత యవకాశము లేక, ఒక గుహవలె నుండుటచేతనే అయ్యది "చీఁకటికొట్టు" అని చరిత్రయందు ప్రపంచవిఖ్యాతిగాంచియున్నది. మఱియొక విశేషము. ఒకగదియందు నింతకంటె నెక్కుడుమంది నేరస్థుల నుంచరాదను నిబంధనలు నేఁడు గలవు. కాని, చీఁకటి కోణమువలె నుండిన నాటి ఆంగ్ల కారాగృహమున, బట్టునంతమందిని గ్రుక్కుటయే యాచారమైయుండెను.

కలకత్తానగరము నబాబు యధీనమైనపుడు పట్టుపడిన ఆంగ్లేయులసంఖ్య 146. మరుచటి ఉదయమున వారిని నబాబుయెదుటఁ బెట్టవలయునని యోచన జరిగెను. అపుడు సాయంకాలమైయుండుటచే, వారి నారాత్రి భద్రపఱచుటకొక స్థలము కావలసివచ్చెను. ఆంగ్లేయకారాగృహమునందే ఆంగ్లేయులను భద్రపఱుపవలయునని కావలివారు నిశ్చయించిరి. పాపకూపమువలె నుండిన ఆయాంగ్ల కారాగృహమే లేకుండినచో, నబాబుయొక్క భటుల

కట్టి బుద్ధిపుట్టక పోయియుండును. * నేరస్థుల నట్టి పాపకూపము
నఁ బడద్రోయుట ఆంగ్లేయుల కాచారమైయుండుటచేతనే, వారి
కట్టిగతి సంభవించెనని సుప్రసిద్ధచరిత్రకారుఁడగు "మిల్లు" వ్రా
సియున్నాఁడు.

సురాజదౌల కీవిషయమై యేమియుఁ దెలియకపోయినను, నేర
స్థుల నట్లాకూపమునఁ గూరుట ఆంగ్లసాంప్రదాయమే యైయుండి
నను, ఆటుపిమ్మట జరిగిన చరిత్ర కడు విషాదకరముగ నుండును.
ఆంగ్లేయులచే నందు ద్రోయఁబడు వార లెందఱు మరణించుచుం
డిరో లెక్కకు రాలేదుగాని, ఈ నూటనలుబది యార్గురి విషాద
చారిత్రము మాత్ర మాచంద్రార్కముగ నిలిచియుండును.

నూటనలుబది యార్గు రాంగ్లేయులును, అట్టులా చీకటికొట్టు
లో నుంచఁబడిరి. గది చాలాచిన్నదియగుటచేతను, వలయు ప్రా
ణవాయువందుఁ బ్రవేశించుట కవకాశము లేకుండుటచేతను, పడ
రాని పాట్లుపడి, మరునాఁడుదయమునఁ దలుపులు తెఱచి చూచు
సరికి నూటయిరువదిముగ్గురు మరణించిరి. ఈ యుదంతము కడు
విషాదకరమైనదనుటకు సందియము లేదు. కాని, నేఁడు సహిత మి
ట్టి ఘోరమగు హత్యలు జరుగుచునే యున్నవి. కడు విషాదకర
మగు మాపిలాఖైదీల చారిత్రమే యిందుకు నిదర్శనము.

కలకత్తాయందలి ఆంగ్లేయుల విషాదచారిత్రము, కర్నాటకదే
శమున నుండిన ఆంగ్లేయ కంపెనీ సేవకులకుఁ దెలియవచ్చెను. బం
గాళాదేశమున పాశ్చాత్యులు హైన్యస్థితియందుండినను, వారు ద

* "The English had their own practice to thank for suggesting it to the officers of the subahdar as a fit place of confinement"—P. 166, Vol, III, Mill and Wilson.

క్షిణహిందూదేశమున నంతకు బూర్వమే అమితమగు పలుకుబడిని
సంపాదించిరి. పాశ్చాత్యసైనికులతో హైందవసైనికులు సరిరార
నియు; హైందవులకు పాశ్చాత్యశిక్షణ మొసంగి, అట్టి హైందవసై
న్యములతో హైందవనృపాలురను బరాజితులనొనరింప నగుననియు
ను బుజువాయెను. రాజ్యములకై పోరాడు హైందవనృపాలురు
పాశ్చాత్యులసాహాయ్యము నాహ్వానించుచుండిరి. మంచిచెడ్డల నర
యక, సమయోచితముగఁ బ్రవర్తించుచు, లాభములను గ్రహిం
చుటయందు నాఁటి పాశ్చాత్యులసాధారణ నైపుణ్యమును గలిగి
యుండిరి. అట్టి పెక్కుకారణములచే నాంగ్లేయులు కర్నాటక దే
శమున జాలపలుకుఁబడిని గడించియుండిరి. తద్రాజ్యాధిపతియగు
మహమ్మదాలీ వారిపై నాధారపడి యుండెను.

కర్నాటకదేశమునందలి ఆంగ్లేయులలో నెల్ల "రాబర్టు క్లైవు"
అను నాతఁడు ప్రధానపురుషుఁడై యుండెను. బాల్యకాలమున నీతఁ
డు విద్య నభ్యసించుటకు మారుగ, దుండగముల నొనరించుచు
గాలము గడపుచుండుటచే, నాతని తండ్రి యాతఁడెందులకు నక్కు
రకురాని దౌర్భాగ్యుఁడని యెంచి, ఈస్టుఇండియా కంపెనీవారి నా
శ్రయించి, హిందూదేశమున కాతని బంపివైచెను. చెన్నగర
మున నాతఁడు స్వల్పవేతనముపై నొక లేఖరిగ నియమింపఁబడె
ను. అనతికాలమున నాతఁ డఖండ విఖ్యాతిగాంచునని యెవ్వరు నె
ఱుంగరైరి. కార్యశూరుఁడగు క్లైవునకు కలముబట్టుట కడుగష్టము
గనుండెను. ఫ్రెంచివారిని బ్రతిఘటింపఁజాలక ఆంగ్లేయులు డిల్లప
డియుండిన సమయము, క్లైవు తనయందు దాగియుండిన యద్భుత
గుణములను బ్రదర్శించుటకు మిక్కిలి యనుకూలముగ నుండెను.

అసాధారణమగు సాహసముఁగలవాఁడగుటచేతను, సమయము ఎంత ప్రతికూలముగ నున్నను జలింపని ధైర్యస్థైర్యములు గలవాఁడగుటచేతను, ఇతరకారణములు గూడ అనుకూలించుట చేతను, ఆంగ్లేయులను క్లైవు ఉద్ధరింపఁగలిగెను.

కలకత్తానగరమునందలి తమసంఘమునకు సంభవించిన యుపద్రవము నెఱింగినంతనే తొమ్మిదివందల యూరపియనులను, పదునైదువందల సిపాయిలను వెంటబెట్టుకొని కర్ణాటకదేశమునుండి క్లైవు బయల్వెడలెను. ఐదు నావలను వెంటబెట్టుకొని "అడ్మిరలు వాట్సను" కూడ బయలుదేఱెను. సైన్యసమేతులగు వీరిర్వురు డిసెంబరు 20 వ తారీఖున గంగానది బ్రవేశించి, కలకత్తానగరమునుండి పాఱివచ్చిన ఆంగ్లేయులకు ధైర్యము గఱపి, కలకత్తానగరమును దిరిగి స్వాధీనపఱచికొనుటకై వలయు ప్రయత్నముల నొనరించిరి. అనేక కారణము లనుకూలించుటచే నాంగ్లేయులకును నబాబునకును 1757 ఫిబ్రవరి తొమ్మిదవ తారీఖున సంధి కుదిరెను. కలకత్తానగరము ఆంగ్లేయుల యధీనమాయెను. ఆ నగరమును దానాక్రమించుటవలన గలిగిన నష్టపరిహారార్థము వారికి నబాబు ధనమొసంగెను. ఆంగ్లేయులు ప్రారంభించిన కలకత్తానగర ప్రాకారములను బూర్తిచేయుటకుఁ గూడ నాతఁడనుమతించెను. వారనుభవించుచుండిన వర్తకపు హక్కులను గూడ నబాబు వారికి మఱల బ్రసాదించెను. అపాయము సంభవించునపు డొకరికొకరు సాహాయ్యమొనరించుటకు నిరువురు నొడంబడిరి.

ఈ తెఱంగున నాంగ్లేయులకు లాభకరమగు షరతులపై సంధి

కుదురుటచే, వారు తొంటియట్లు వ్యాపారమును సాగించుచు లాభమును గుడుచుట సహజము. వారి వర్తకమున కెట్టి యడ్డంకియును లేదు. అతిశీఘ్రకాలమున నాంగ్లేయులవలన రానుండిన మహా యుపద్రవమును నెఱుంగఁజాలక, వారిచే దాను రాజ్యభ్రష్టుఁడాయెదనని గుర్తింపఁజాలక, వారి కారణమున దనకు బ్రాణహత్య సహితము ప్రాప్తించునని గలనైనఁ దలంపఁజాలక, సురాజదౌలా బేలయై, భీఱఁదక్కి, ఏమఱియుండెను.

క్లైవు బంగాళాదేశమునకు నరుదెంచినంతనే అచ్చటి ఆంగ్లేయ కంపెనీయొక్క తత్వము పూర్తిగ మాఱిపోయెను. ఆతఁడు కార్యశూరుఁడును దుడుకు స్వభావుఁడును అగుటచే, మందముగ నుండు వర్తకమాతనికి రుచింపదాయెను. సారవంతమగు బంగాళాదేశమున నాంగ్లేయరాజ్యమును స్థాపింపవలయుననియు, భారతధనమును సంగ్రహింపవలయుననియు నాతఁడు సంకల్పించెను. పాశ్చాత్యసైన్యముల ముందు హైందవసైన్యములు నిలువఁజాలవనియు, తనకు సాధ్యము కాని దేదియు నుండదనియు నాతఁడెఱింగియుండెను. పరిస్థితులుమాత్ర మనుకూలముగ నేర్పడవలయును. సాహసవంతుఁడును, ఉపాయశాలియును, ధర్మాధర్మములను సరకుఁజేయక కార్యసాధనమును మాత్రమే ప్రధానసూత్రముగ గణించు వాఁడును అగు క్లైవు సంకల్పించునపుడు పరిస్థితు లనుకూలింపకుండు టెట్లు?

బంగాళాదేశాధిపతి స్వాతంత్ర్య విరహితుఁడు కావలయును: ఆంగ్లరాజ్య సంస్థాపనము సిద్ధింపవలయును: కథానాయకుఁడగు క్లైవుదొర సంకల్పసిద్ధుఁడు కావలయును. ఎట్టి సాహసముచే, ఎట్టి

వక్రమార్గములచే, ఎట్టి మాయోపాయములచే నయ్యవి సఫలమాయెనో పాఠకులు గమనింతురు గాక.

ఆంగ్లేయులవలెనే, ఫ్రాన్సు హాలండు మొదలగు దేశముల వారలు గూడ భారతధనమును సంగ్రహించుటకై యేతెంచి యుండిరి. బంగాళాదేశమునందలి చంద్రనగరము ఫ్రెంచివారికి ముఖ్యనగరమై యుండెను. ఆంగ్లేయులవలె ఫ్రెంచివారుగూడ వర్తకపు హక్కులను గడించి, అచ్చటచట కర్మాగారములను నిర్మించి, వ్యాపారము నొనరించుచు, లాభమును సంపాదించుచుండిరి. నబాబు యెడల వారు భయభక్తులతో మెలంగుచుండుటచే నాతఁడు వారిని సముచితభంగి గౌరవించుచుండెను. ఆశా పరవశుఁడై యుండిన క్లైవు తీవ్రపడి నబాబుపై వైరము బ్రకటించునేని, అతనికి ఫ్రెంచివారు సాహాయ్యమొసంగుదురు. అపుడు, ఆంగ్లేయుల దురాశ భగ్నమగును. కాఁబట్టి, నబాబునకు ఫ్రెంచివారు తోడ్పడు ప్రమాదము తొలంగవలయును. మహాకార్యమును దలపెట్టిన క్లైవునకు ఇయ్యది ప్రధాన కర్తవ్యమై యుండెను.

ఆంగ్లేయులును సురాజదౌలాయును వైరులై యుండిన సమయము, ఇంగ్లాండు ఫ్రాన్సుదేశములకుగూడ యుద్ధసమయమై యుండెను. నబాబుపై వైరమూనిన ఆంగ్లేయులకు ధైర్యము చాలక, తమ శత్రువులగు ఫ్రెంచివారి సాహాయ్యమును నాహ్వానించిరి. ఆంగ్లేయుల స్థితి మిక్కిలి యపాయకరముగ నుండుటచే, శత్రువుల సాహాయ్యము నపేక్షించునంతటి హైన్యమునకు వారు పాల్పడిరి. ఫ్రెంచివారు మాత్రము మిక్కిలి ఘనముగఁ

ప్రవర్తించిరి. తమకుఁజెందియుండిన చంద్రనగరమును ఆంగ్లేయులు గైకొని, వారి కలకత్తానగరమునుఁ దమకు వారొసంగుదురేని, వారికిఁ దాము సాహాయ్యమొనరింతుమని ఫ్రెంచివారు బదులిడిరి. అట్లొనరించుటకుఁ దమకు స్వాతంత్ర్యము చాలదని నిరూపించుచు, వారి సాహాయ్యము నాంగ్లేయులు నిరాకరించిరి. అట్టితఱి, ఫ్రెంచివారు కినుకఁబూని నబాబునకు సాహాయ్యమొనరింతురేని, నబాబు విజయుఁడగుట నిక్కము: ఫ్రెంచివారికిఁ బెక్కు లాభములు లభించును: ఆంగ్లేయులు బంగాళాదేశమున నిలుచుటకు నీడయైన నుండకుండెడిది. కాని, తమవలె, భారతధనమున కాసించి ఖండాంతరము నుండి యేతెంచిన ఆంగ్లేయులు అట్టి విషమస్థితి యందుండినపుడు, వారిపై గత్తిగట్టుట ధర్మవిరుద్ధమనియు పౌరుషహీనమనియును నెంచి, తాము తటస్థముగ నూరకుందుమని ఫ్రెంచివారు తెలియఁబఱచిరి. వారి యౌదార్యము కడుంగడు శ్లాఘనీయముగ నుండెనని పాఠకులు గుర్తింపఁగలరు. అట్టి స్థితియందు నాంగ్లేయులుకూడ దమవలె తటస్థభావము వహింపవలయుననియు, అట్టి యొడంబడికను దామిరువురు గావించికొనవలయుననియును ఫ్రెంచివారు కోరిరి. ఆసంధిని ఆమోదించినట్టులే ఆంగ్లేయులు వ్యవహరించిరి: ఫ్రెంచివారు తటస్థముగ నూరకుండిరి. ఇంతలో నాంగ్లేయులకును నబాబునకును సంధి పొసగెను. నబాబువలనను ఫ్రెంచివారివలనను వారికి రానుండిన విపత్తు తొలంగెను: వారి ప్రాణములు కుదుటఁబడెను. కాని, అంత మాత్రమున నాంగ్లేయులు సంతసించి యూరకుండినచో, క్లైవునొక్క అత్యాశలు ఫలించునెట్లు?

ఆంగ్లేయులు కష్టదశయందుండినపుడు, వారికి ఫ్రెంచివారు మహోపకారమొనరించియుండిరిగదా. ఆకారణమున, ఆంగ్లేయులు విశ్వాసఘాతకముగఁ బ్రవర్తింతురని యెఱుంగఁజాలక, ఫ్రెంచివారు ఏమఱియుండిరి. నబాబుతోడి సంధి కుదిరినంతనే, క్లైవు మిత్రద్రోహమును దలపెట్టెనని యెఱుంగఁజాలక, వారు అప్రమత్తులై యుండిరి. * అట్లు వారప్రమత్తులై యుండినపుడే, న్యాయాన్యాయములను లెక్కింపక, ధర్మాధర్మములను సరకుఁజేయక, పాపభీతిని దలంపక, వారిపైఁబడి, వారి చంద్రనగరమును స్వాధీనపఱచికొని, వారిని దగ్ధమొనరింపవలయునని క్లైవు సంకల్పించెను. అకారణముగ ఫ్రెంచివారిపై దాడివెడలుటకు ఆంగ్లేయుల మనస్సాక్షి బాధింపకుండినను, నబాబుతో సఖ్యముగనుండిన ఫ్రెంచివారిపై దండెత్తినచో నబాబు ఆగ్రహించునని వెఱచి, ఆతని యనుమతి బొందవలయునని ఆంగ్లేయులు ప్రయత్నించిరి. ఫ్రెంచివారిపై దండెత్తుటకొరకు కారణమును నిరూపించుట యవసరమాయెను. కాఁబట్టి, వారి యునికి దమక్షేమమునకు భంగకరముగనుండెననియు, ఆకారణమున వారిపై దండెత్తవలయుననియును ఆంగ్లేయులు నబాబున కెఱింగించిరి. అయ్యది సహేతుకముగ లేకుండుటచే నాతఁడు సమ్మతింపఁడాయెను.

ధర్మవిరుద్ధముగ నుండిన ఆంగ్లేయుల దుష్ప్రయత్నములకు నబాబు దోహదమొసంగకుండుట దోషము కాదనియు, ఆతని ప్రవర్తనము మిక్కిలి సమంజసముగ నుండెననియును పాఠకు లెఱుంగఁ

* Cf "......and the return for the French forbearance and desire for peace was to be their extirpation from their factory, and the demolition of their dwellings at Chandranagore".—Torren's Empire in Asia. p. 32.

గలరు. కాని, కార్యము నెఱవేరవలయునుగాని, ఆంగ్లేయకంపెనీ సేవకులకు న్యాయాన్యాయ విమర్శనయేల? వారు నబాబున కెట్టి ప్రత్యుత్తరమొసంగిరో, వారాతని నెట్లు వెఱపించిరో గమనింపుడు. తామిరువురము స్నేహితులమనియు, తాము గావించికొనిన యొడంబడిక ననుసరించి యొకరికొకరు సాహాయ్యమొనరింపవలయుననియు, తాము కోరు సాహాయ్యము నొసంగుటకు నబాబు వెనుదీయునేని, సర్వవ్యాపియగు పరమాత్ముఁడు పాపకూపమున నాతనిఁ బడఁద్రోయుననియును ఆంగ్లేయులు తెలియఁబఱచిరి. వారలా తెఱంగున దైవముగుఱించి ప్రశంసించుట మిక్కిలి హాస్యాస్పదము, కేవలము సాహసము. అంతటితో నబాబు లోఁబడడని గ్రహించి, వారాతనికి దమ అంత్యసందేశమును దెలియఁబఱచిరి. తమసైన్యములు పెక్కులు అతిశీఘ్రముగ నరుదెంచుచుండెననియు, సస్యశ్యామల శోభితమగు బంగాళాదేశమును భస్మీభూతమొనరింతుమనియు నాంగ్లేయులు వెఱపించిరి. ఆసమయముననే, అఫ్ఘనుదేశాధిపతియగు ‘అహమ్మదుషా అబ్దాలీ’ బంగాళాదేశముపై దండెత్తనుండెనని దెలియవచ్చెను. కాబట్టి ఆంగ్లేయులపై నబాబున కెంతటి యాగ్రహము జనించినను, ఆతఁడా కోపమునంతటిని దిగమ్రింగి యూరకుండిన వాఁడాయెను.

ధర్మవిరుద్ధముగ నాంగ్లేయులు పైఁబడుదురని యెఱుంగఁజాలక, ఫ్రెంచివారు ఏమఱియుండిరిగదా. అట్టిసమయమున్న, ఉఱుమని పిడుగులవలె నాంగ్లేయులు వారిపైఁబడి, వారి చంద్రనగరమును స్వాధీనఁబఱచికొని, నిర్దయులై, తన్నగరవాసులనెల్ల ఘోరముగ దోచికొనిరి. ఆతెఱంగున భంగపడిన ఆనగరవాసులపై జాలిగొని, తన నగరమున వారికి స్థానమొసఁగి, తన యౌదార్యము

నుసురాజదౌలా వెలిబుచ్చెను. అకారణముగ దనదేశముపై దండెత్తి క్రౌర్యమునకు గడంగి, తనదేశమునందలి శాంతికి భంగము కలిగించిన ఆంగ్లేయులపై నబాబు కుపితుఁడాయెను. కాని, నిరంకుశప్రవర్తకుఁడగు క్లైవు నబాబును సరకుఁజేయలేదు. ఎట్టి యుపాయముచేనైన నాతని స్వాతంత్ర్యవిరహితు నొనరింపవలయునని క్లైవు కృతనిశ్చయుఁడై యుండెను. ఎట్టులైనను బంగాళా దేశాధిపతిని యుద్ధరంగమున కీడ్వవలయునని ఆతఁడు సంకల్పించియుండెను. అట్టి యుద్దేశములుగల క్లైవు, ఫ్రెంచివారియొక్క యితరకర్మాగారములుకూడ నాశనము కావలయునని నబాబున కెఱింగించెను. తోడనే, నబాబు, దండతాడిత భుజంగమువలె నుగ్రుఁడాయెను. ఆంగ్లేయులవలనఁ దనకు ముప్పు వాటిల్లుననియు, తన నాశనమును వారు తలపెట్టిరనియు నాతఁడప్పుడే గ్రహించెను. అట్టిసమయమున ఆంగ్లేయులచే భంగపడిన ఫ్రెంచివారి సాహాయ్యము వడసి, తన వినాశమును దలపెట్టిన ఆంగ్లేయులను వెంటనే శిక్షించుటకు మాఱుగ, నబాబు ఉపేక్షచేసెను. అనుభవజ్ఞుఁడును, కార్యైకతత్పరుడును అగు క్లైవు మిక్కిలి మెలకువగ మెలంగెను. ఈగలు మొదలగు నల్పజంతువులను అసహాయుల నొనరించి వానిని బట్టుటకై సాలెపురుగు పన్నెడు పట్టువలె, బంగాళాధిపతిని స్వాతంత్ర్యవిరహితు నొనరించుటకై క్లైవు మహాప్రయత్నము లొనరించెను.

నబాబుయొక్క స్వాతంత్ర్యమును హరింపవలయునని క్లైవు వేఁచియుండెనుగదా. కాని, ఆతనిపై తక్షణము దండెత్తినచో కార్యభంగమగునని యెంచి, క్లైవు మాయోపాయమునకుఁ గడంగెను.

సురాజదౌలా మొత్తముమీఁద ఉదారస్వభావుఁడును, ప్రజాక్షేమాభిలాషియునైనను, అతని తాతయగు అలివర్దీఖానునకుఁగల మేధాశక్తియు, ప్రజాహృదయము నాకర్షించు నేర్పు, శీఘ్రగమనము, సమయోచిత ప్రవర్తనమును ఆతనియందులేవు. అట్టి లోపములవలని లాభమును బోసిక, తన కార్యమును నిర్వర్తింపవలయునని క్లైవు యోచించెను. ఫిబ్రవరి మాసమున నాంగ్లేయులకును నబాబునకును సంధి కుదిరినప్పుడు, "వాట్సు" అను ఆంగ్లకంపెనీసేవకుఁడు తనరాజధానియగు మూర్షదాబాదు నగరమున 'రెసిడెంటు'గ నుండవలయునని నబాబు కోరెను. వాట్సుయొక్క బాహ్యప్రవర్తనమును గాంచి, ఆతఁడు సాత్వికస్వభావుఁడని నబాబు భ్రమించెను. కాని, తనప్రాణమును హరించు సర్పమును ఆహ్వానించియుంటినని సురాజదౌలా ఆసమయమున గ్రహింపఁజాలకపోయెను. ఈ వాట్సు మూర్షదాబాదు జేరినంతనే, నబాబుప్రభుత్వమునెడ విముఖులైయుండు వారిని జేరదీయుచు, వారి సాహాయ్యముచే నితరులనుగూడ నాకర్షించుచు, ఎప్పటి సమాచారముల నప్పుడు క్లైవునకు నివేదించుచుండెను. అలివర్దీఖానుయొక్క సోదరిని వివాహమాడిన మీర్జాఫరు సైన్యాధిపతియై యుండెను. క్లైవుయొక్క సాహాయ్యముచే దనకు మహారాజ్యాధిపత్యము లభించునని గ్రహించి, ఆ దుర్మార్గుడు స్వామిద్రోహమొనరించుట కియ్యకొనెను. సురాజదౌలాయొక్క ప్రధానమంత్రియగు "రోయి దులుబ్" అను నాతఁడును, "యార్ ఖాన్ లాట్టీ" యను నొక సేనానియును, నందకుమారుఁడను మహారాజునును, తంత్రజ్ఞులగు కొందఱు ధనికులునుగూడ సురాజదౌలాను రాజ్యభ్రష్టు నొనరించుట కొడం

బఁడిరి. ఆంగ్లేయులును మీర్జాఫరునుగలసి ఒక యొడంబడికను వ్రాసికొనిరి. అందలి షరతులు ముందు విశదమగును. ఆంగ్లేయులు నవాబుపై దండెత్తవలయును, ఉభయసైన్యములు రణక్షేత్రమునకేతెంచవలయును మీర్జాఫరు స్వామిభక్తిపరాయణుఁడు వోలె నభినయింపవలయుననియు, రెండుసైన్యములును యుద్ధమునకుఁ దలపడు ముందు నవాబును విడనాడి, తనసైన్యములను వెంటబెట్టుకొని, ఆంగ్లేయులతో నేకీభవింపవలయుననియును ఏర్పాటాయెను.

కథలో చిత్రకథవలె, ఈ విషాదవృత్తాంతమునందొక విషాదోపవృత్తాంతము కలదు. కలకత్తానగరమున 'ఉమిచందు' యను నొక కోటీశ్వరుఁడు వ్యాపారమొనరించుచుండెను. సురాజదౌలాతో నాతనికి మిక్కిలి పరిచయముండెను. తాను పన్నుచుండిన కుట్ర సఫలమగుటకు ఉమిచందుయొక్క సాహాయ్యముకూడ మిక్కిలి యవసరమై యుండునని క్లైవు భావించెను. అట్లు భావించి, కార్యము నెఱవేరిన పిమ్మట, ఆతనికి 3000000 రూపాయిల నిప్పించెదనని క్లైవు బాసచేసెను. ఉమిచందు సమ్మతించెను. ఆంగ్లేయుల ప్రవర్తనమును నవాబు అనుమానించునపుడు, వారు 'ఆడితప్పనివారు' అని ప్రమాణమొనరించుచు; నవాబుయొక్క సేవకుల స్వామిభక్తినిఁ జెఱచుచు; ఆతని రహస్యములనెల్ల నాంగ్లేయులకు నెఱింగించుచు,- ఇట్లనేక తెఱంగులుగ నవాబున కాతఁడు శల్యసారథ్యమొనరించుచు, నాంగ్లేయులకు మహోపకార మొనరించుచుండెను. కాఁబట్టి, తనకు మఱింతధనము నొసంగుటకు సమ్మతింపవలయుననియు, అట్లు కాదేని, రహస్యమును నవాబున కెఱింగింతుననియును ఉమిచందు పలికెను. కలకత్తానగరముననుండిన ఆం

గ్లవర్తక సంఘాధికారులకుఁ దెలియవచ్చెను. * ధనాశాపరవశులై యుండిన ఆసంఘాధికారులకు ఉమిచందుయొక్క ధనతృష్ణ దుర్భరముగ నుండెను. ఆతఁడు పాతకియనియు, దోషియనియును పండ్లు పటపట గొఱుకుచు, ఉమిచందుని నిందించి, ఆతనికొక్క కాసైనను ముట్టరాదని వారు తీర్మానించిరి. వారట్లు తీర్మానింపవచ్చునుగాని, ఆసంగతి ఉమిచందుకు దెలియునేని, వారికి గొప్పయుపద్రవము సంభవించును. కాని, నవాబు పదభ్రష్టుఁడైనట్లును, తాను మీర్జాఫరును రాజ్యాధిపతి నొనరించినట్లును, తనకును తన యనుచరులకును ధనరాసులు దొఱకినట్లును, క్లైవుయొక్క మనోనయనమునకు స్పష్టముగ గోచరించుచుండెను. అట్టిసమయమున, అల్పుఁడగు నొక హైందవవర్తకుని నిమిత్తమున, తనమహాప్రయత్నముల నుపసంహరించుకొనుటకు క్లైవు సహించునా? కాఁబట్టి, పాపమని వెనుదీయక, క్లైవు ఒక్క యుపాయముచే, ఉమిచందువలన రానుండిన మహోపద్రవమును క్షణమాత్రమునఁ దొలఁగించెను. ఆంగ్లేయుల వాక్కులను విశ్వసింపఁజాలక, మీర్జాఫరుతో వారు వ్రాసికొనిన యొడంబడిక పత్రమునందు తనకు ముట్టవలసిన ద్రవ్యముగుఱించి యుదహరింపవలయునని ఉమిచందు కోరెను. తోడనే ఒక యెఱ్ఱకాగితముపై సంధిషరతుల నన్నింటిని లిఖించి, అందు ఉమిచందుయొక్క ద్రవ్యముగుఱించికూడ క్లైవు వ్రాయించెను. ఎఱ్ఱకాగితముపై వ్రాయు నొడంబడిక నిరర్థకము

* "To men whose minds were in such a state, the great demands of Omichund appeared (the reader will laugh—but they did literally appear) a crime. They were voted a crime;"—Mill and Wilson, Vol. III, P. 193

ని పాలకు లెఱుంగఁగలరుగాని, ఉమిచందుమాత్ర మెఱుంగఁడాయెను. ఆపత్రముపై క్లైవు మొదలగు నాంగ్లవర్తక సంఘాధికారు లెల్లరుఁ దమతమ సంతకములను వ్రాసిరి. ఒక్క 'వాట్సను' మాత్రము తన సంతకమునొసంగఁడాయెను. ఆతనియందలి మనస్సాక్షి పూర్తిగ నశింపలేదు. క్లైవు యొనరించు మోసమునకుఁ దోడ్పడుట దోషావహమని యెంచి, ఆతఁడు నిరాకరించెను. కాని, వాట్సనుయొక్క సంతకము గోచరింపని పత్రమును ఉమిచందు విశ్వసింపఁడు. అనుమానించుట కాతనికి నవకాశ మొసంగినచో క్లైవు తలపెట్టిన మహాకార్యమంతయును జెడిపోవచ్చును. మహాసీయుఁడగు క్లైవు మఱియొక యుపాయముచే నా యుపద్రవమును అనాయాసముగఁ దొలఁగించెను. ఎట్టి నేరమొనరించిన ఇంగ్లాండుదేశమున శిరచ్ఛేదన మొనరించుచుండిరో, ఎట్టి నేరమొనరించిన 'నందకుమారుఁడను మహారాజు ఆంగ్లేయులచే ఘోరముగ వధింపఁబడెనో, క్లైవుకూడ అట్టి నేరమునే యొనరించెను. వాట్సనుయొక్క సంతకమును ఆ యెఱ్ఱని పత్రముపై నాతఁడు (క్లైవు) వ్రాసెను. అయ్యది వాట్సనుయొక్క వ్రాతయేయని భ్రమించి, ఉమిచందు సంతుష్టాంతరంగుఁడాయెను. ఆతనివలన నాంగ్లేయులకు రానుండిన ప్రమాద మాతెఱంగునఁ దొలంగెను.

ఆంగ్లేయు లాశాపరులనియు, మిక్కిలి సాహసవంతులనియు, న్యాయాన్యాయములను గణింపక కార్యమును సాధింపఁజాలు నేర్పరులనియు, వారు తనను రాజ్యభ్రష్టు నొనరింపఁజాలుదురనియు ను సురాజాదౌలా యెఱిఁగినవాఁడైనను, ఆతఁడు జడస్వభావుఁడ

గుటచే సముచితప్రయత్నములను సమయోచితంబుగ నొనరింపఁజాలనివాఁడాయెను. క్లైవు మొదలగువార లొనరించుచుండిన ప్రయత్నముల నాతఁడు కనిపెట్టఁజాలఁడాయెను. తన సైన్యాధిపతియగు మీర్జాఫరు స్వామిద్రోహమున కొడఁబడి, మాసములకొలది ఆంగ్లేయులతో రహస్యాలోచనలు సలుపుచుండినను, సురాజదౌలా యెఱుంగఁడాయెను. శనిగ్రహమువలె దాపరించిన ఉమిచందు నాతఁడు విశ్వసించియుండెను. రాజ్యాధిపతియందు నంతటి బుద్ధిమాంద్యము దోషముగదా. ఆతని బుద్ధిమాంద్యముచే నాతఁడు రాజ్యభ్రష్టుఁడును, తుదకు విగతజీవుఁడును అగుటయేగాక, బంగాళా బీహారు ఒరిస్సాదేశము లాంగ్లేయుల వశమాయెను.

సురాజదౌలాను రాజ్యభ్రష్టునొనరించుటకు వలయు మహాప్రయత్నము లన్నియు సిద్ధమైనపిదప, ఆతని రాజధానియగు మూర్షదాబాదుపై దండెత్తుటకై 1757 జూను 13వ తారీఖున క్లైవు బయల్వెడలెను. ఆతఁడు 1000 మంది సోల్జరులకును, 2100 మంది సిపాయిలకును అధినాథుఁడై యుండెను. స్వామిద్రోహమున కియ్యకొనిన మీర్జాఫరు, మార్గమధ్యముననుండిన "కట్వా" యను గ్రామమువద్ద క్లైవునుఁ గలసికొందునని, బాసచేసెను. కాని, క్లైవు కట్వాగ్రామము చేరినపిమ్మట, విశేషసైన్యసమన్వితుఁడగు మీర్జాఫరు గోచరించుటకు మారుగ, ఆతని సేవకుఁడొకఁడు ఆతఁడొసంగిన జాబునుదెచ్చి క్లైవున కొసంగెను. పరదేశాగతులగు నాంగ్లేయులను విశ్వసించి, నబాబును బహిరంగముగా విడనాడినచోఁ బ్రమాదము వాటిల్లునని యెంచి, యుద్ధభూమియందు దాను వారితోఁ గలియుదునని మీర్జాఫరు వ్రాసెను. మోసకార్యమునఁ దల

పెట్టిన దనకే మోసము వాటిల్లెనని క్లైవు మొదట చలించెను. ఆంగ్లేయులు అల్పసంఖ్యాకులు. కాఁబట్టి యుద్ధసమయమున మీరాజ్జాఫరు సాహాయ్యమొనరింపఁడేని, దావానలమునఁబడి మ్రగ్గెడు మిడుతలవలె, నబాబుయొక్క మహాసైన్యమధ్యమునఁబడి మలమలమాడి చత్తుమని నిరూపించి, అతిరయమున వెనుకకు మఱలుటయే తరుణోపాయమని క్లైవుయొక్క సహకారులు సలహాచేసిరి. ప్రప్రథమమున నాతని స్థైర్యము సహితము చలించెను. కాని, క్లైవు స్థిరచిత్తుఁడు; సాహసవంతుఁడు; మేధావంతుఁడు; పాషాణహృదయుఁడు. ఇఁక జరుగఁబోవు సంగరమున విజయుఁడగునేని, అతఁడు మహాపురుషుఁడగును, మహాలాభమును బొందును; అతి విశాలములును, అతి సారవంతములును అగు బంగాళా, బీహారు, ఒరిస్సా, దేశము లాతని యధీనమగును. అట్లుకాక, జయము అనుమానముగనుండెనని సంకోచించి వెన్నిచ్చినచో, ఆ లాభములన్నియుఁదొలంగును. నవ్యమగు నింకొకసమయమునుజూచి, తన అత్యాశలను ఫలింపఁజేయునంతటి యోపిక ఆతనికి లేకపోయెను. కాఁబట్టి, మీరాజ్జాఫరు సాహాయ్యమొసంగక పోయినను సరే, అపజయము ప్రాప్తించినను సరే, వెనుకకు మఱలరాదని క్లైవు నిశ్చయించెను. ఈ సందర్భమున క్లైవుయొక్క ప్రధాన లక్షణమును గుర్తింపనగును. ఆతఁడు ధర్మాధర్మములను, న్యాయాన్యాయములను, పాపపుణ్యములను గణించువాఁడుకాఁడని పాఠకులు గ్రహించియేయున్నారు. ఆతని ధైర్యస్థైర్యములు కొనియాడఁదగియున్నవి. ఆతని సాహసమసాధారణమైనది. ఈ సందర్భమున మనము గమనింపఁదగు విష

యమెద్దియన,—మీర్జాఫరు మోసగించునటులుండినను, పరాజయము గోచరించుచుండినను, పరాజయమువలని యుపద్రవము సహితము గ్రహింపఁదగి యుండినను, క్లైవు రణమాచరింపవలయునని స్థిరచిత్తుఁడై యుండెను. ఇయ్యది కేవలము సాహసము—యుక్తాయుక్తములను సరకుఁజేయని మోటు సాహసము. కాని, ఒక్కొకపుడు, ఇట్టి మొండిసాహసమే ఫలప్రదమగుచుండును. ఈ సమయమున నట్లే సంభవించెను.

జయమునకు వలయు వివిధసన్నాహముల నొనరించికొని క్లైవు బయలుదేఱువఱకును, జడుఁడై మందబుద్ధియై మిన్నకుండిన సురాజదౌలాకూడ ఆంగ్లేయులు యుద్ధసన్నద్ధులై బయల్వెడలిరని తెలిసినంతనే, తనకుఁగల రాణువనంతయుఁ బ్రోవుచేసి, శాత్రవులను శిక్షించుటకై బయల్వెడలెను. హైందవ పాశ్చాత్యసైన్యములు రెండును ప్రసిద్ధిగాంచిన "ప్లాసీ" యను గ్రామము సమీపమున విడిసిరి. 50,000 కాల్బలమును, ప్రశస్తమగు 18,000 అశ్వికదళమును నబాబు కలిగియుండెను. వానివెనుక దృఢమగు నేఁబది ఫిరంగు లమరియుండెను. నాలుగు చిన్నఫిరంగుల సాహాయ్యముగల * నలుబదిమంది ఫ్రెంచిసైనికు లుచితస్థలమున నిలిచియుండిరి. వారివెనుక, 5000 అశ్వికదళమును, 7000 సైనికులును బారులు తీర్చియుండిరి. స్వామిభక్తిపరాయణుఁడును, రణవ్యాపారపారాయణుఁడును అగు "మీరు మురిడ్డీను" ఆసైన్యమున కధినాథుఁడై యుండెను. తక్కుంగల సైన్యమంతయు శ్రేణులు కట్టి వలయాకారముగ నిలిచియుండెను. శ్రేణుల మధ్యభాగమున ఫిరంగు

* మార్గమధ్యమున వారు నబాబుయొక్క సైన్యములోఁ జేరిరి.

లు నోరులు తెఱచికొని, శత్రుసంహారమొనరించుటకు సిద్ధముగ నుండెను. స్వామిద్రోహులును దేశద్రోహులును అగు మీర్జాఫరుయును, 'రోయిదులుబు' యును 'లాట్టీ' యును ఆసైన్యమధ్యముననే యుండిరి. తనకై ప్రత్యేకముగ గొంత దూరమున నమర్పఁబడిన గుడారమున, సేవకులచేతను, వందిమాగధులచేతను, స్వామిద్రోహులచేతను బరివృతుఁడైన సురాజదౌలా, రానుండిన మహోపద్రవమును గుర్తింపఁజాలక నిర్భయముగ నాసీనుఁడై యుండెను.

ప్లాసీయందలి మామిడితోటయందు నాంగ్లేయులు విడిసియుండిరి. అనుభవజ్ఞుఁడగు క్లైవు చక్కని వ్యూహమును బన్ని అప్రమత్తుఁడై తిరుగాడుచుండెను. యుద్ధము ప్రారంభము కానుండినను, మీర్జాఫరు నబాబుసైన్యమధ్యముననే యుండుటచే, నాంగ్లేయుల స్థితి కడుప్రమాదకరముగ నుండెనని వేఱుగఁ జెప్పనక్కరలేదు. ఐనను, ధైర్యము నవలంబించి రణమాచరింప వలయుననియే క్లైవు స్థిరచిత్తుఁడై యుండెను. దారిద్ర్యభారమును సహింపఁజాలక, తనకుఁగల స్వల్పమగు నాస్తిని సొమ్ముగమార్చి, కుబేరుఁడు కాఁగల పేరాసతో 'లాటరీ' వేయు నరునిభంగి, సమయమంత నిరుత్సాహకరముగ నుండినను, అపజయమువలన గలుగు మహానష్టము దయ్యమువలె గోచరించుచుండినను, జయించుటచే లభించు మహాలాభములను లెక్కించుచుండిన క్లైవు సమరకార్యైక తత్పరుఁడై యుండెను.

* తుదకు, జూను 23 వ తారీఖున నిరుతెగలవారును యుద్ధమునకుఁ దలపడిరి. నబాబుయొక్క సైనికులు ధైర్యముగఁ బోరాడిరి. ఆంగ్లసైన్యమునందు బదిమంది యూరపియనులును, ఇరువదిమంది సిఫాయిలును మరణించిరి. వెనుకకు తగ్గుటయే క్షేమకరమని భావించి, క్లైవు అట్లొనరించెను. నబాబుయొక్క సైనికులుత్సాహపూరితులై, తమఫిరంగులను ముందుకు నడిపిరి. ఉదయమున నెనిమిది గంటలకు యుద్ధము ప్రారంభమాయెను. మధ్యాహ్నమువఱకు నిరుతెగలవారును దమతమ ఫిరంగులను తుపాకులనుమాత్రమే ప్రయోగించుచుండిరి. అంత, నబాబుయొక్క సైన్యాధిపతులలోనెల్ల నగ్రగణ్యుఁడును, స్వామియందమితానురాగము గలవాఁడును అగు 'మీరుమురుద్దీను' హఠాత్తుగ గుండుదెబ్బతిని నేలఁగూలెను. తోడనే, నబాబుయొక్క ధైర్యమంతయు నంతరించెను. అంతవఱకు గాంభీర్యముగ నుండిన నబాబు భయవిహ్వలుఁడాయెను. మీర్జాఫరును తక్షణము రావించి, 'రణభారమును వహించి, స్వామిని రక్షించికొనవలయు' నని యాతఁడు దైన్యముగఁబలికెను. కాని, రాజ్యాధిపతి కాగోరు ఘాతకునకు స్వామిభక్తి యెక్కడ? ఆతఁడు వినయమును స్వామిభక్తిని నభినయించుచు, తన శిబిరమునకుఁ బోయి, ఆసమాచారమును దెలుపు నొక జాబును వ్రాసి క్లైవునకు శీఘ్రముగఁ బంపెను. నబాబు అట్లు కలవరపడుచుండునపుడే ఆతనిపైఁబడవలయునని క్లైవున కాతఁడు వ్రాసియుండెను. మీర్జాఫరు వెడలినపిమ్మట, నబాబుయొక్క వెఱపు మఱింత యధికమాయెను. రెండవ స్వామిద్రోహియును, ప్రధానామాత్యుఁడును అగు 'రోయిదులుబు' సమీపముననేయుండెను. భయవిహ్వలుఁడై యుండిన నబాబునకు ధైర్యముగఱపుటకు మా

* This short description of the battle is adapted from Orme II Vol. P. 173—77,

ఱుగ, రణక్షేత్రము నతిశీఘ్రముగ వీడి, నిజరాజధానికిఁ బలాయనమొనరించుటయే క్షేమకరమని నబాబున కాతఁడుపదేశించెను. మిక్కిలి కలవరపడుచుండిన నబాబున కట్టి యుపదేశమే రుచికరముగనుండెను. అట్లొనరింపవలయునని తోడనే యాతఁడాజ్ఞాపించెను.

అపుడు మధ్యాహ్నము రెండుగంటలాయెను. నబాబుయొక్క యాజ్ఞననుసరించి సైనికులందఱు ప్రయాణసన్నాహము లొనరింపఁగడంగిరి. నబాబుసైన్యమునందలి ఫ్రెంచిసైనికులుమాత్రము రణమాచరించుచునే యుండిరి. ప్రయాణసన్నాహము లొనరించుచుండిన నబాబుయొక్క సైన్యముపై ఫిరంగులను వదలి, వారిని గలవరపఱచి, వారిని బాధించుటకై ఆంగ్లపటాలమొకటి బిఱబిఱ ముందుకు నడచెను. ఫ్రెంచిసైనికులు వారిని వారింపఁగడంగిరి. అంతలో సైన్యసమన్వితుఁడై క్లైవు యరుదెంచెను. నబాబుయొక్క సైనికులు కూడ యుద్ధసన్నద్ధులైరి. మీర్జాఫరుమాత్రము తన సైన్యముతో గొంతదూరమున నుండి తటస్థముగ నూరకుండెను. నబాబుయొక్క శిబిరముపై నాంగ్లేయులు ఫిరంగిగుండ్లను వదలనారంభించిరి. తోడనే, ఆతని సైనికులందఱు నొక వ్యూహముగ నేర్పడి చక్కగ సంరక్షించికొనుచు, తమ ఫిరంగులను ముందుకు నడిపించిరి. అంత, తనసైన్యముతో క్లైవు మఱింత ముందుకుఁబోయి, తన ఫిరంగుల నతిత్వరితముగ మ్రోగించెను. నబాబుయొక్క ఫిరంగులను లాగుచుండిన వృషభము లనేకము లాకారణమున మరణించెను. నబాబుయొక్క సైనికులు తగిన ప్రత్యుత్తర మొసంగిరి. ఫ్రెంచిసైనికులు గుఱిజూచి తమ ఫిరంగులను వదలుచుండిరి. నబాబుయొక్క సైనికులందఱు, మఱుగుననుండి తమ తుపాకులను

సవరించికొనుచు, సూటిగను అవిరళముగను నాంగ్లేయులపై వదల నారంభించిరి. ఆంగ్లఫిరంగులు విషజ్వాలలను గ్రక్కుచుండినను సరకుఁజేయక, నబాబుయొక్క యాశ్వికదళము శత్రుసంహారమొనరింపఁగడంగెను. ఈసమయమునగూడ నాంగ్లేయులకు జాల నష్టము సంభవించెను. నబాబుయొక్క సైన్యము తెఱంగున ధైర్యస్థైర్యములు వహించి, హోరాహోరి బోరాడుచుండిన సమయమున, ఆశ్వికదళసమేతుఁడగు మీర్జాఫరు బహిరంగముగ నబాబును విడనాడెను. ఆతఁడట్లు తరలినంతనే నబాబుయొక్క సైన్యమున మహాకలవర ముదయించెను. అట్టిమహాసమయమునకే క్లైవు తత్తరపాటుతో నిరీక్షించుచుండెను. తోడనే, తనసైన్యమును వెంటబెట్టుకొని, శరవేగమున నాతఁడు నబాబుయొక్క సైన్యముపై లంఘించెను. సైన్యాధిపతియగు మీర్జాఫరు దారుణముగనట్లు తరలుటయు, తోడనే ఆంగ్లసైన్యము పిడుగువలె వచ్చి పైఁబడుటయును గాంచినంతనే, నబాబుయొక్క సైన్యమంతయు తుత్తునియలాయెను. రణకార్యనిర్వాహకుండై, తత్కార్యైక దీక్షాపరతంత్రుఁడై మెలంగవలసిన సైన్యాధిపతియే, శత్రువుల దుష్ప్రయత్నములకు దోహదమొసంగి, రణరంగమున స్వామిద్రోహ మొనరించునపుడు సామాన్యసైనికుల ధైర్యస్థైర్యము లెట్లు నిలుచును? భయభ్రాంతులైన యాదౌర్భాగ్యులు, తమఱేడు రణభూమిని నిలిచియుండెననియైనను గణింపక, నల్దిశల బాఱిరి. తోడనే, ఆంగ్లేయులను బాఱదోలుటకై, యేతెంచిన సురాజదౌలాకూడ చేయునదిలేక, రయమునఁ బలాయనమొనరింపవలసిన వాఁడాయెను.

తనరాజధానియగు మూర్షదాబాదు నగరమునకు సురాజదౌ

లా పోయెను. కాని, అతనికి బరాజయము ప్రాప్తించినంతనే, ఆతని పరివారజనమంతయు నాతని విడనాడిరి. నిజరాజధాని కరుదెంచు రాజ్యాధిపతిని గౌరవించువారును, పరివేష్టించువారును ఎవ్వరు లేరైరి. అట్లు తన బంధుమిత్ర దాసదాసీజనులెల్లరుఁ దనను బహిష్కరించినందుల కెంతయు వగచి, క్లైవుయొక్క యాజ్ఞ ననుసరించి తనను బంధించుటకై యరుదెంచిన మీర్జాఫరు మొదలగువారిచే నిండియుండిన ప్రదేశమున నిలుచుట క్షేమకరము కాదని విచారించి, తన మిత్రులగు ఫ్రెంచివారిఁ జేరి కర్తవ్యమాలోచింపవలయునని నిశ్చయించి, నిజరూపునఁ బోయినచో మార్గమధ్యమున నెట్టియుపద్రవము సంభవించునోయని వెఱచి, సన్యాసివేషము ధరియించి, స్వామిభక్తిపరాయణులగు నిరువురు సేవకులుమాత్ర మాతని వెంబడింప, సురాజదౌలా మూర్షదాబాదు నగరమును వీడెను.

ఫ్రెంచివారు నబాబును గౌరవాభిమానములతోఁ జూచుచుండిరని పాఠకు లెఱుంగుదురుగదా. నబాబును రాజ్యభ్రష్టునొనరించుటకై, ఆంగ్లేయులును మీర్జాఫరు ప్రభృతులును దుర్మంత్రంబులొనరించుచుండినపుడు, "లా" యను ఫ్రెంచినాయకుఁడు నబాబువద్దనుండెను. ఆ ఫ్రెంచినాయకుఁడు మేధావియగుటచే, నచ్చటి దుష్టుల దుష్ప్రయత్నములను గనిపెట్టుచుండెను. తమరు తలపెట్టిన మహాకార్యమా ఫ్రెంచివానివలన భంగపడునని భావించి, ఆతని నెట్టులైన నా ప్రదేశమునుండి తొలగింపవలయునని వారు సంకల్పించిరి. మూఢుఁడగు నబాబు తనచెంతనుండిన ద్రోహుల దుర్మంత్రంబులకుఁ జెవియొగ్గి, ఫ్రెంచినాయకుని మూర్షదాబాదునుండి పంపివైచెను. ఆతని సాహాయ్య మవసరమైయుండునపుడు వర్త

మాన మంపెదననియు, ఆతఁడపుడు సైన్యసమేతుఁడై చనుదెంచి తనకు వలయు సాహాయ్యము నొనరింపవలయుననియు నాతనితో నబాబు చెప్పియుండెను. తనను విశ్వాసముతోఁ గొలుచు ఫ్రెంచినాయకుని బంపివైచుటయందలి యవివేకమును ఆతఁడపుడు గుర్తింపఁజాలక పోయెను. అందలి యనర్థమును గ్రహించిన ఫ్రెంచినాయకుఁడాతనితో నిట్లు పలికెను—"స్వామీ! అవసరమగునపుడు వర్తమానమంపెదవా? ఇఁక మనమిరువురము గలియుట కల్లయని నమ్ముము. మనము కలిసికొనఁజాలము. కలియుట కవకాశముండదు." అని పలికి, నబాబుయొక్క సెలవుగైకొని, ఆతడు నిష్క్రమించెను. ఆతఁడు వెడలిన పిమ్మటనే, ఆంగ్లేయులు దండెత్తిరి. తోడనే, ఆతనికి నబాబు వర్తమానమంపెను. వర్తమానమరుదెంచినంతనే, సైన్యమును సమకూర్చుకొని ఫ్రెంచినాయకుఁడు ప్రయాణమాయెను. నబాబునకు సాహాయ్యమొనరింపఁగల యుత్సాహముతో నాతఁడు ప్రయాణమొనరించుచుండెను. ఆతనిరాకకై నబాబు యెదురుచూచుచుండెను. సమయమున కాతని సాహాయ్యమందియుండెనేని, ఆంగ్లేయు లెట్టి కుతంత్రములొనరించినను, మీర్జాఫరు మొదలగు నరాధములు ఎంతటిద్రోహమున కొడిగట్టినను, నబాబు విజయుఁడై యుండెడివాఁడు. కాని, అదృష్టదేవత నబాబును బూర్తిగ విడనాడియుండెను. ప్లాసీయుద్ధము జరిగినపుడా ఫ్రెంచినాయకుఁ డా ప్రదేశమున కిరువదిమైళ్లదూరమున విడిసియుండెను. యుద్ధరంగమున కాతఁడంత దగ్గఱగనుండినను, ఆ సమాచార మాతనికిఁ దెలియలేదు. ఫ్రెంచిసైన్య సాహాయ్యవిరహితుఁడైన నబాబున కెట్టి యపజయము ప్రాప్తించెనో పాఠకు లెఱింగియేయున్నారు.

భోగపరాయణుఁడగు రాజ్యాధిపతి సన్న్యాసివేషధారియైనను, రానుండిన మహాయుపద్రవము మాత్రము తొలఁగలేదు. కాలము సమీపించియుండుటచే, మృత్యుదేవత పొంచిపొంచి ఆతని వెనువెంటఁ దిరుగుచుండెను. అనివార్యమగు కారణముచే నాతఁడు మార్గమధ్యముననుండిన రాజమహాలునందు నిలువవలసినవాఁడాయెను. ఆ నగరమును ఎన్నఁడు వీడుదునో, మిత్రులగు ఫ్రెంచివారి నెన్నఁడు జేరఁగలనో, ఎన్నఁడు నిజసింహాసనాసీనుఁడ నాయెదనో యని సురాజదౌలా పరితపించుచుండ; నరాధములు కొందఱు ఆతని నిజరూపును గుర్తించి, పట్టి, బంధించి, తిరిగి మూర్షదాబాదు నగరమున కాతనిఁ గొంపోయిరి. మిక్కిలి దురదృష్టవంతుఁడగు నమ్మహారాజు తోడనే వధింపఁబడెను. ఆతనితోఁబాటు బంగాళాదేశ స్వాతంత్ర్యమంతరించెనవియు, అయ్యది హైందవస్వాతంత్ర్యాంతమునకు దారిజూపెననియును పాఠకులు గ్రహింతురుగాక.

ఈ తెఱంగున క్లైవు సంకల్పసిద్ధుఁడాయెను. ఇఁక స్వామిద్రోహియగు మీర్జాఫరు సింహాసనాసీనుఁడు కావలయును. ఇంతటి ఘనకార్యము నతి జయప్రదముగ నిర్వర్తించిన క్లైవు ప్రభృతుల ధనతృష్ణ తీరవలయును: కంపెనీకిఁ జెందవలసిన మహాలాభములన్నియు లభింపవలయును. కాఁబట్టి, సురాజదౌలా వధ్యుఁడైనంతనే, మీర్జాఫ రాంగ్లేయుల సాహాయ్యముచే బంగాళా, బీహారు, ఒరిస్సాదేశములకు రాజాయెను. ఆంగ్లేయులతో నాతఁడు కావించికొనియుండిన యొడంబడిక ననుసరించి, సుమారు 3½ కోట్ల రూపాయిల నాతఁడు చెల్లింపవలసినవాఁడాయెను. అంత ధనము బొక్కసమున లేకుండుటచే నందలి యర్ధభాగము నపుడు చెల్లింపవలయుననియును, మిగిలిన పైకము మూడుసంవత్సరములలో జెల్లవలయు

ననియును తీర్మానింపఁబడెను. సైన్యాధిపతిగ మరణింపవలసిన తనకు మహారాజ్యాధిపత్యమును గడించి యిచ్చిన క్లయివునెడఁగల ప్రేమాతిశయముచేతనో, లేక, రాజ్యాధిపతి నొనరింపఁజాలిన మహాపురుషుఁడు (క్లయివు) ఆ తెఱంగుననే దనను రాజ్యభ్రష్టునిఁగూడ నొనరింపఁజాలునని యూహించియోగాని, ఆతనికి ప్రత్యేకముగ మీర్జాఫరు సుమారు 20,00,000 రూపాయిలను గానుకగ సమర్పించినవాఁడాయెను. ఆతని యనుచరులుగూడ, వారివారి తాహతుల ననుసరించి బహూకరింపఁబడిరి. 'రోయిదులుబ్' మొదలగు స్వామిద్రోహులుకూడ సత్కరింపఁబడిరి. * ఉమిచందునకు మాత్ర మేమియు ముట్టలేదు. కంపెనీకిగూడ బెక్కు లాభములు లభించెను. కేవలము తనపై నాధారపడియుండువాఁడు రాజ్యాధిపతియైయుండ ఆంగ్లకంపెనీకి వేఱొండేమి కావలయును? ¶ నబాబు యొక్క కోశాగారముననుండిన ధనరాసినంతయు దిట్టమగు నేడువందల పెట్టెలలో భద్రపఱచి ఆ పెట్టెలను భద్రముగ నూరు నావల కెత్తించి, జనులెల్లరు వెలవెలబోయి చూచుచుండ, జయభేరులను మ్రోగించుచు, తమ జాతీయపతాకముల నెగరవేయుచు, నాంగ్లసైనికులు మూర్షదాబాదు నగరమును వీడిరి. తనకు రాజ్యాధిపత్యము ప్రాప్తించినందులకు మీర్జాఫరు పరమానంద భరితుఁడాయెనో, ఇంతటి ద్రవ్యమును గ్రక్కవలసినవాఁడగుటచే నాతఁడు విచారగ్రస్థుఁడాయెనో చెప్పఁజాలముకాని, ఇంతధన మొక్కసారి తరలుటచే, మూర్షదాబాదునందలి బొక్కసముమాత్రము శూన్యమాయెను. ఆ కోశాగార మట్లు శూన్యమైనను, నబాబు చెల్లింపవలసిన పైకమంతయుఁ జెల్లకుండుటచే, ఆ కొఱతకు బదులుగ, చిరకాలార్జితములగు నాభరణాదులనుగూడ నాతఁడు సమర్పించికొనవలసినవాఁడాయెను.

* క్లయి వొనరించిన మోసము నెఱింగినంతనే మూర్ఛిల్లి, వెఱ్ఱివానివలె గొంత కాలము సంచరించి, ఉమిచందు మరణించెను. ¶ Cf, Orme, Vol, II. P, 187.

ఏది యెట్లున్నను, మీర్జాఫరు రాజ్యాధిపతియాయెను; క్లైవునకు ధనరాసులును ప్రతిష్ఠా గౌరవములును సిద్ధించెను. ఆతని యదృష్టమునకు మేఱలేదు. ఆతని గుణదోషములను పాఠకులు గ్రహించియేయున్నారు. అట్టి క్లైవునే హైందవలక్ష్మి వరించినదాయెను. అచిరకాలమున, మీర్జాఫరునకును అయోధ్యదేశాధిపతికిని యుద్ధము సంభవించెను. అందు, మీర్జాఫరునకు క్లైవు సాహాయ్యమొనరించెను. మీర్జాఫరు విజయుఁడాయెను. తోడనే ఆతఁడు సంతసించి, "ఉమ్రా" యను బిరుదమును క్లైవునకొసంగెను. కాని, ఆతఁడట్టిబిరుదములతో సంతసించువాఁడు కాఁడు. అభిమానపూర్వకముగ నవాబు ప్రసాదించిన బిరుదముయొక్క గౌరవమును నిలుపుకొనగలుగుటకై, తనకొక జాగీరునుగూడ నొసంగవలయునని యాతఁడు కోరెను. తనను రాజ్యాధిపతి నొనరింపఁజాలిన మహాపురుషుని కోరికను నవాబు నెఱవేర్పకుండుటెట్లు? మీర్జాఫరు 2,70,000 రూపాయిల సంవత్సరాదాయముగల జాగీరును క్లైవునకొసంగెను. అచిరకాలమున, నాతనివలన నింగ్లాండుదేశమునకు గలిగిన మహాలాభములను గుర్తించి, ఆతనిదోషములను తలంపక, ఆంగ్లనృపాలుఁడాతనికి "లార్డు" అను బిరుదము నొసంగెను. కాని, కొంతకాలమాతఁడు లండనునగరమున మహావైభవము ననుభవించి, తుదకు నాత్మహత్య నొనరించి మరణించెను.

ధరణీరాజ్యమునకై స్వామిద్రోహ మొనరించిన మీర్జాఫరు హంసతూలికాతల్పాది రాజభోగముల నెంతకాల మోలలాడెనో, ప్లాసీయుద్ధకారణమున నెట్టి పరిస్థితు లేర్పడెనో, గమనింపవలసియున్నది. "బక్సారుయుద్ధ" మను గ్రంథమున నీవిషయములు తెలియఁగలవు. పాఠకమహాశయులు వేచియుందురుగాక.

ప్లాసీ యుద్ధము.

ఇయ్యది ఆంగ్లేయులు బంగాళాదేశమును జయించిన విషయమును దెలుపు చిన్న గ్రంథము. ఇందు సామాన్య జనులకు దెలియని విషయము లనేకము లుండును. ఈ గ్రంథము పండిత వరేణ్యులచే నాదరింపఁబడినది. వెల 0-4-0.

రాబోవు గ్రంథములు.

(1) భ్రమరాంబ. ఇది యొక అపరాధపరిశోధక నవల.
గ్రంథకర్త: బ్రహ్మశ్రీ కేతవరపు వెంకటశాస్త్రిగారు.

(2) బక్సారు యుద్ధము. గ్రంథకర్త: మొ॥ సంజీవరావుగారు.

(3) పద్మిని. ఇయ్యది ఆంగ్లేయకవిపుంగవుఁడగు 'మిల్టను' రచించిన 'కోమస్' యను నాటకము ననుసరించి వ్రాసిన నాటకము.
గ్రంథకర్త: శ్రీయుత మొసలికంటి హనుమంతరావుపంతులుగారు, బి. ఎ. ఎల్. టి.,
మహారాజా కాలేజి, విజయనగరము.

(4) ఆలిబాబా. ఇయ్యది 'అరేబియను నైట్సు' కథ ననుసరించి వ్రాసిన నాటకము.
గ్రంథకర్త: శ్రీయుత ఈదరపు వెంకటరామజోగీశ్వర శర్మ, విశాఖపట్టణము.

END OF
TITLE